క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నేడు (శుక్రవారం) నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం జరుగనుందని అధికారులు తెలిపారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమావేశానికి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించనున్నారు. కాగా కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక మొదటి సమావేశం కావడంతో ప్రాధాన్యత నెలకొంది.

మండల సమావేశం నేడు

నందలూరు : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డిలు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కావున మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ ప్రకాష్ కోరారు.

అధైర్యపడద్దు అండగా ఉంటాం

పుల్లంపేట : పార్టీ కార్యకర్తలు అధైరపడరాదని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు రైల్వేకోడూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి తెలియజేశారు. గురువారం పుత్తనవారిపల్లి గ్రామంలో జరిగిన జాతరకు ఆయన హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని పూజలలో పాల్గొన్నారు. తదుపరి పుత్తనవారిపల్లి గ్రామానికి చెందిన నళిని కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడి నియామకం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా ముద్దపోలు సుబ్బరామయ్య, కార్యదర్శిగా గుగ్గిళ్ల సుబ్బరాయుడులను నియమించినట్లు గురువారం రాష్ట్ర కార్యదర్శి కటికం సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాపులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎల్లమ్మకు బోనాలు సమర్పణ

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని హెచ్‌పీసీఎల్‌కు సమీపంలో ఉన్న ఎల్లమ్మతల్లికి గురువారం భాకరాపేట గ్రామ ప్రజలు మొదట గ్రామంలో ఉన్న గంగమ్మకు పూజలు చేసిన అనంతరం మహిళలు బోనాలను ఎల్లమ్మ గుడివద్దకు దప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపు, కుంకుమలతో అలంకరించారు. మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు పడి రైతు పంటలు సిరిసంపదలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. అనంతరం వారి కుటుంబీకులు, బంధువులు స్నేహితులతో కలసి విందు భోజనం ఆరగించారు.

బాల్య వివాహాల వలన ఆరోగ్య సమస్యలు

పుల్లంపేట : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం ఎంపీడీఓ నరసింహమూర్తి, మండల విద్యాశాఖ అధికారులు చక్రాధర్, నాగా తిరుమలరావుల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాల్య వివాహాలు వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. మహిళలు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రూత్ మేరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మునెమ్మ, నిర్మల, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

చిన్నమండెం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.నందిని 580/600 మార్కులు, ఎస్.హుస్నా 570/600 మార్కులు, ఎన్.స్పందన 568/600 మార్కులను పదో తరగతిలో సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

రాజంపేట స్టేషన్ అభివృద్ధిపై కన్సల్టేటివ్ కమిటీ భేటి

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధిపై స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ గురువారం ఎస్ఎంఆర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఇందులో స్టేషన్ మేనేజర్ ప్రమోద్‌కుమార్, కమిటీ సభ్యులు గాదెల శ్రీనివాసులు, జీకే నాగరాజు, తోట రామయ్య, గుణవర్మ, రాఘవేంద్రలు పాల్గొన్నారు. స్టేషన్‌లో ప్రధానంగా వసతులు, ఫర్నీచర్, పార్కింగ్ అంశాలపై కమిటీ చర్చించింది. పలు రైళ్ల హాల్టింగ్ అంశంపై చర్చించారు. కమిటీ తీసుకున్న నిర్ణయాలను డివిజన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని కమిటీ వెల్లడించింది. ప్రధానంగా ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలపై గుంతకల్ రైల్వే అధికారులు దృష్టి సారించాలని కమిటీ తెలిపింది.

కొండెక్కిన ధరలు

- చుక్కలనంటుతున్న నిత్యవసర, కూరగాయల ధరలు
- మార్కెట్ వెళితే సామాన్యుడి జేబుగుల్లే



కోడూరు పట్టణంలో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

కూరగాయలు ధరలు	కేజీ రూలలో
టమోటా	100
బెండ	60
బీన్స్	60
ఎర్రగడ్డ	50
ఉల్లగడ్డ	70
పచ్చిమిర్చి	80
అల్లం	180
మునగ	200
క్యాబేజీ	50
వంకాయలు	50

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతూ పేద ప్రజలకు ఏం కొనేటట్టులేదు తినేటట్టు లేదనే పాటను గుర్తుకు తెస్తున్నాయి. సాధారణంగా కోడూరు ప్రాంతంలో కూరగాయలు, ఆకుకూరలు విరివిగా పండిస్తూ తరలిస్తుంటారు. అయినా కానీ ఈ ప్రాంత ప్రజలకు కూరగాయల ధరలను వింటుంటే విస్తుపోవాల్సిన పరిస్థితి. రోజువారీ కూలీ చేసుకునే పేదవాడు మూడు పూటలా భోజనం చేయాలంటే ఉన్న కూలీ ఎక్కడ పోతుందోనని భయపడి పచ్చడి మెతుకులతోనే జీవనం సాగించాల్సిన దుస్థితి దాపురించింది. సాధారణంగా ధరలు రూ.10 నుంచి 50 రూపాయల లోపు ఉంటాయి. అయితే ధరల తగ్గదల కొద్ది రోజులు మాత్రమే ఉండి ఏ రకం కొనాలన్నా ప్రతినిత్యం అవసరమైన కూరగాయల ధరలు వ్యాపారులు పెంచుకుంటూ పోతున్నారు. దీనితో పేదవాడి జీవితం పట్టాలు తప్పి ఇబ్బందులు పడుతున్నారు. పేద వర్గాలు మార్కెట్‌లో ధరలు విని నోట మాటరాని పరిస్థితులు నెలకొన్నాయి. ఏ కూరగాయల ధరలు చూసినా 60 రూపాయలకు తక్కువ లేకపోవడంతో ఖాళీ సంచులతో ఇంటికి వెళ్తున్నారు. టమాటా, ఎర్రగడ్డ, బీన్స్, అల్లం, మొదలగు వాటిని నిత్యం వినియోగిస్తుంటారు. వీటి ధరలు పెంచుతూ ఉండటంతో పేదవారు పరిమితంగా కూరగాయలు వినియోగించుకొంటూ ఉన్నారు. ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి మార్కెట్‌కు వెళ్లి టమాట, ఎర్రగడ్డ, అల్లం, క్యారెట్‌లు కొనాలంటే వాటి ధరలకు కొనుగోలుదారునికి ఇబ్బంది పెట్టిస్తున్నాయి. సాధారణంగా రోజువారీ కూలీ 500 రూపాయలు సంపాదిస్తే ఆ డబ్బులు కూరగాయలకే సరిపోతోంది. కూరగాయల ధరలు అధికంగా ఉండటంతో అన్నిరకాలు కొనకుండా ఇంటికి వెళ్తున్నారు. పేదవాడు జీవించే పరిస్థితి లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారంగా కుటుంబ పోషణ



ప్రతి నెలా జీతం వచ్చినపుడు కూరగాయల కోసమే ప్రత్యేకంగా డబ్బులు కేటాయించాల్సి వస్తోంది. ఏరోజుకారోజు కూరగాయలు ధరలు పెరుగుతూ ఉండటంతో వారానికి ఒకరోజు మార్కెట్‌కు వెళితే ఎంత ఖర్చవుతుందో అర్థం కావడంలేదు. ధరలు తగ్గకుంటే కుటుంబ పోషణ కష్టతరమే. ప్రభుత్వం సబ్సిడీపై కూరగాయలు విక్రయించాలి.

– ఓబుల్‌రెడ్డి, ఉర్లగడ్డపోడు, రైల్వేకోడూరు

ధరల నియంత్రణ లేకుండా పోయింది



పట్టణంలో కూరగాయల ధరలకు నియంత్రణ లేకుండా పోయింది. దుకాణాదారులు వారికి ఇష్టం వచ్చినట్లు ధరలు నిర్ణయించి విక్రయాలు చేస్తున్నారు. దీంతో దిగువ, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. ఏది కొందామని మార్కెట్‌కి వెళ్తున్నా కొనాల్సిన దాని కన్నా తక్కువ మొత్తంలో కొంటున్నాం. ప్రభుత్వాలు ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

–గౌరి, వైఎస్సార్ కాలనీ, రైల్వేకోడూరు

మట్టి గణనాథులనే విక్రయించాలి



గణపతి విగ్రహ తయారీదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

రాయచోటి అర్బన్ : రసాయన పదార్థాలు, పీఓపీలతో వినాయక విగ్రహాలను తయారుచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు హెచ్చరించారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన పట్టణ పరిధిలోని వినాయక విగ్రహ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ పరిధిలోని రాజధాని కల్యాణ మండపం, కడప రోడ్డు, గాలివీడు రోడ్డులో విగ్రహాల తయారీ గోడౌన్‌లను పరిశీలించి విగ్రహ తయారీదారులు, సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పర్యావరణానికి నష్టం కలిగించే కెమికల్స్, పీఓపీలతో విగ్రహాలు తయారు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మట్టితో మాత్రమే విగ్రహాలను తయారుచేసి, విక్రయించాలంటూ సూచించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలో దాదాపు 2వేల మట్టిగణపతి ప్రతిమలు తయారుచేయించి ఉచితంగా ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. రాయచోటి ప్రజలు సైతం తమకు సహకరించి మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేసుకుని, పూజలు చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునివ్వాలంటూ విజ్ఞప్తి చేశారు.

ప్రారంభమైన ఇంటింటి సర్వే



కుష్టు వ్యాధి సర్వేను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి డాక్టర్ పి. రవిబాబు

సిద్దవటం : మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్‌లో జరుగుతున్న జాతీయ కుష్టు(లెప్రసీ) వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని గురువారం జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన నోడల్ అధికారి డాక్టర్ పి.రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంపై చర్మంపై స్పర్శలేని మచ్చలు, ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, చల్లని లేదా వేడి పదార్థాలను గుర్తించ లేక పోవడం, ఇవన్నీ కుష్టి వ్యాధికి సంబంధించిన లక్షణాలు కలిగి ఉంటాయని ఇంటింటి సర్వే చేసి అనుమానితులను గుర్తించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఆశా వర్కర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలానే పి.కొత్తపల్లె పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో సీహెచ్‌ఓ లోకేశ్వరి ఆధ్వర్యంలో సిబ్బంది కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, సీనియర్ ఆరోగ్య కార్యకర్త లక్ష్మీదేవి, ఆశా వర్కర్‌లు ఓబులమ్మ, కళావతి, విజయభారతి, పాల్గొన్నారు.

ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



జేఎంజే సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

సిద్దవటం : మండలంలో ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం గురువారం జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ఆర్‌డీఓ వెంకటపతి స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని కనుమలోపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలోని జేఎంజే కళాశాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి, ఇక్కడ నేషనల్ హైవే వెళ్లే మార్గాన్ని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హైవేకి పెట్రోల్ బంక్ స్థలానికి మధ్య దూరాన్ని ఆయన పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో నాలుగు వైపులా జెండాలు పాతారు. కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, ఆర్‌ఐ అనూరాధ, వీఆర్‌ఓ నాని, గ్రామ సర్వేయర్ ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలు ఆపకుంటే ప్రతిదాడులు తప్పవు

రాజంపేట టౌన్ : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సాగిస్తున్న అరచకాలు ఆపకుంటే ప్రతిదాడులు తప్పవని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివాదరహితుడు, ఎంతో సౌమ్యంగా ఉండే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ రౌడీలు దాడులకు తెగబడేందుకు యత్నించడం సరైనది కాదన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఎంపీ వాహనాలను ధ్వంసం చేయడం పిరికిపందల చర్య అని దుయ్యబట్టారు. ఎన్నికల ఫలితాల రోజునుంచే తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నా సీఎం చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్లే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయన్నారు. అధికారంలోకి వచ్చి నెలన్నర దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, అలాగే రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై హత్యలు, అత్యాచారాలు అధికం కావడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రోజు, రోజుకు పెరిగిపోతోందన్నారు. అందువల్ల ప్రజల దృష్టిని మరల్చేందుకే చంద్రబాబు, నారాలోకేష్ తెలుగుదేశం పార్టీ రౌడీలను ఉసిగొలిపి ఎంపీపై దాడికి పురమాయించారన్నారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. గురువారం రాయచోటిలోని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలుసుకుని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా ఆర్టీసీ ద్వారానే జీతాలు చెల్లించాలన్నారు. థర్డ్ పార్టీ పద్ధతిని రద్దుచేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజపతి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి గౌరీశంకర్, ఉపాధ్యక్షుడు సోమశేఖర్, కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి సలీంబాషా పాల్గొన్నారు.

అవినీతిని నిర్మూలిస్తా

రాయచోటి టౌన్ : అవినీతిని నిర్మూలిస్తానని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జామియా మజీద్ కమిటీ, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంత్రికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆఫీసులలో మీ పని కోసం ఎవరూ లంచం ఇవ్వాల్సిన పని లేదన్నారు. మైనార్టీల కోసం మెటర్నటీ ఆస్పత్రి, మైనార్టీ విద్యార్థినుల కోసం జూనియర్ కళాశాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కొత్తపల్లె ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానన్నారు.

మామిడిలో కొమ్మలను కత్తిరించాలి

నందలూరు : మామిడికాయల కోత అనంతరం కొమ్మ కత్తిరింపులు చేయాలని రాజంపేట ఉద్యానశాఖ అధికారి సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని లేబాక, నల్లతిమ్మాయిపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలోని మామిడి రైతులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి తోటలలో కాయల కోత అనంతరం కొమ్మల కత్తిరింపులు ద్వారా అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, ఎండు పుల్లలు తొలగించాలని రైతులకు సూచించారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి, వెలుతులు చెట్ల కొమ్మలపైకి ప్రసరించేలా తూర్పు, పడమర వైపు ఉన్న కొమ్మలను కత్తిరించాలని చెప్పారు. కొమ్మ కత్తిరింపులు అనంతరం కాపర్ ఆక్సీ క్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, తరువాత పచ్చిరొట్ట ఎరువులుగా జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి పూతదశలో భూమిలోకి కలియదున్నాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు వరుణ్ కుమార్, హేమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్ సుకుమార్

లక్కిరెడ్డిపల్లె : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ డేవిడ్ సుకుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందించే వైద్యంపై ఆరాతీసి ఆసుపత్రి గదులను పరిశీలించారు. వైద్యంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆసుపత్రికి రోగులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, వారికి సరిపడ మందులు, మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. రక్తనమూనా పరీక్షలు చేసి వైద్యం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నీలోఫర్ బేగం, ధరణీ, సుమలత, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఒక వరం



చిట్వేలి: మాట్లాడుతున్న లీగల్ అడ్వైజర్ చంద్రకళ

చిట్వేలి : బాధిత మహిళలకు వన్‌స్టాప్ సెంటర్లు ఒక వరమని లీగల్ అడ్వైజర్ చంద్రకళ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్, వెలుగు సంస్థల ఆధ్వర్యంలో వంద రోజుల మిషన్ శక్తి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రకళ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో మిషన్ శక్తి పేరుతో మహిళల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా వన్‌స్టాప్ సెంటర్లు, ఉమెన్ హెల్ప్ లైన్ 181 నెంబర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 లాంటివి పనిచేస్తున్నాయని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నప్పటికీ నేటికి ద్వితీయ శ్రేణి పౌరులుగా సరైన రక్షణ లేకుండా జీవించాల్సి వస్తుందని వాపోయారు. బాధిత మహిళకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత సాటి మహిళలదే అన్నారు. అలాంటి వారి పునరావాసం కోసం శక్తిసదన్ లాంటి హోమ్‌లను మహిళా శిశు సంక్షేమశాఖ నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సురేఖారాణి, వసుందరమ్మ, సీసీలు సురేంద్ర, ఈశ్వరయ్య, సుబ్రమణ్యం, రాజమోహన్, ప్రమీలమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై అవగాహన

పెనగలూరు : మిషన్ శక్తిపై ఎంఆర్‌సీ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్, వెలుగులో పనిచేస్తున్న స్వయం సహాయక సంఘం సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ చంద్రకళ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజుల మిషన్ శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు వారు తెలిపారు. జూన్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు మహిళలకు అవగాహన సదస్సు నిర్వహిస్తామని వారు తెలిపారు. దేశంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా వన్ స్టాప్ సెంటర్‌లు, ఉమెన్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లాంటివి ఎప్పుడూ పనిచేస్తుంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ విజయకుమారి, విశాలాక్షి, సురేఖ, వసుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి హాస్టళ్ల సందర్శన

రాయచోటి అర్బన్ : హాస్టల్ విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులతో కలసి వసతి గృహ సందర్శనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూతపడిన ప్రభుత్వ వసతిగృహాలను వెంటనే తెరవాలన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, వినయ్, లోకేష్, కుమార్‌నాయక్, వాసుదేవనాయక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించని తహసీల్దార్

చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకుల డిమాండ్

సిద్దవటం : ఫిర్యాదుల పట్ల స్పందించని సిద్దవటం తహసీల్దారుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాజంపేట యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నంది మండలం వెంకటసుబ్బయ్య తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురాషావలీతో భేటి అయ్యారు. అనంతరం వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ గత నెల 10వ తారీఖున సర్వేనెంబర్ 1012/1, 1013/2, 1014/2 లో పెద్దపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ఎస్సీ కులానికి సంబంధించిన భూములను వారి జీవనోపాధి కొరకు కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఈ భూములకు సంబంధించిన వారు గ్రామంలోగాని, మండలంలోగాని, లేకపోవడంతో కొంత మంది ఆక్రమణదారులు నేషనల్ హైవేకు పక్కన ఉన్నటువంటి కోట్లు విలువజేసే టీకేటీ భూమిని అన్యాక్రాంతానికి గురైందన్నారు. మండల తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తహసీల్దారుకు ఆర్‌డీఓ చరవాని ద్వారా చెప్పారన్నారు. రోజులు గడుస్తున్నా తహసీల్దారు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి

అవగాహనా ర్యాలీలు నిర్వహించిన న్యాయవాదులు, పోలీసులు



లక్కిరెడ్డిపల్లె: మూడురోడ్ల కూడలిలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి షైజున్నిసా



నందలూరు: మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రాయచోటి టౌన్: హెల్మెట్ ధరించాలంటూ నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

నందలూరు : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలని మండలంలోని న్యాయవాదులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ వారి సూచనల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎఫ్ఏసి సెక్రటరీ కె ప్రత్యూష కుమారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నందిని ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలపై వన్ కే వాక్ గురువారం నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయవాదులు మాట్లాడుతూ వాహనదారులకు, ప్రజలకు హెల్మెట్ ధరించడం వలన కలిగే లాభాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏవీ సుబ్రమణ్యం, న్యాయవాదులు దాసరి నరసింహులు, మహమ్మద్ అలీ, ఆనంద్ కుమార్, షమీవుల్లా ఖాన్, సుబ్బరామయ్య, మోహన్, నూర్ మహమ్మద్, నరేష్, పోలీసులు, పీఎల్‌వీలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట సీఐ ఆధ్వర్యంలో..

సిద్దవటం : ద్విచక్ర వాహనాదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అధికారులు, విద్యార్థులు ఉపాధ్యాయులు సిద్దవటం పుర వీధుల్లో హెల్మెట్ ధరించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో హెల్మెట్ ధరించండి ప్రమాదాలను నివారించండి, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి అంటూ నినాదాలు పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు, ఎంఈఓ విలియం రాజు, జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం శ్రీరాములు, న్యాయవాది రామదాసు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యురాలు మార్టీనా, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : ప్రతి ఒక ద్విచక్రవాహనదారుడు తప్పకుండా హెల్మట్ ధరించి నడపాలని జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి ఆదేశాల మేరకు జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి న్యాయవాదులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం న్యాయమూర్తల ఆదేశాల మేరకు రాయచోటి బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పగడాల శ్రీనివాసులు మాట్లాడుతూ ద్విచక్రవాహనాన్ని నడిపేటప్పుడు చాలా మంది హెల్మెట్ ధరించకపోవడం వలన తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎంవీ రమణ, మంద నాగేశ్వరావు, కళ్యాణ్, విశ్వనాథ్, పవన్ కుమార్ స్వామి, సీవీ రమణ మూర్తి, అర్బన్ ఎస్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : వాహనచోదకులు ప్రతి ఒక్కరూ హెల్మట్ వాడడం వల్ల వారి ప్రాణాలను రక్షించుకోవచ్చునని గురువారం ఎస్ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్‌లో విద్యార్థులచే ప్రజలకు అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు అమలు చేసేది ప్రజల ప్రాణాలు రక్షించడానికేనని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలన్నారు. వాహనాలు నడిపేవారు నిబంధనల ప్రకారం హెల్మెట్ దరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిన్నపెద్దయ్య, కోర్టు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

లక్కిరెడ్డిపల్లె : ద్విచక్ర వాహనదారులు వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి షేక్ షైజున్నిసా పేర్కొన్నారు. గురువారం మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో స్థానిక మూడురోడ్ల కూడలిలో పోలీసులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, ప్రతి వాహనదారుడు తన ప్రాణరక్షణ కోసం తప్పక హెల్మెట్ ధరించాల్సి ఉంటుందన్నారు. అతి వేగం ప్రమాదకరమని, చాలా మంది ఆటో డ్రైవర్లు ప్రయాణికులను ఆటో కింద, పైన ఎక్కించుకొని ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారని, నెమ్మదిగా ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సీఐ జీవన్ గంగనాథ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్, న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, రెడ్డన్న, చెన్నకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.